సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 3 । జనవరి । 2024

సర్దుబాటు చేశారు..
జీతాలు మరిచారు



గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వీఆర్‌ఏ వ్యవస్థ రద్దు చేసి వారిని ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. అయితే నెలలు గడుస్తున్నా వారికి జీతాలు మాత్రం అందడం లేదు. 8లో▸



కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ 9లో▸

ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. ఆరు గ్యారంటీల కోసం అర్హులంతా దరఖాస్తు చేసుకుంటున్నారు.

గరిష్టం/కనిష్టం
30.0/19.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువజామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ప్రజా పాలన దరఖాస్తులు @ 99,414

కైలాస్‌నగర్: ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలకు సంబంధించి రెండు రోజుల విరామం అనంతరం దరఖాస్తుల స్వీకరణ మళ్లీ ప్రారంభమైంది. ఇందులో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా 38,626 దరఖాస్తులు అందాయి. మండలాల్లో 31,509 దరఖాస్తులు రాగా, ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో 7,117 వచ్చాయి. దీంతో ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా అందిన దరఖాస్తుల సంఖ్య 99,414కు చేరింది. ఇతర పథకాలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో 4,488 దరఖాస్తులు ఉండగా, మున్సిపాలిటీలో 88తో కలిసి మొత్తం 4,576 అందాయి.

రేపు బ్రెయిలీ జయంతి వేడుకలు

కైలాస్‌నగర్: అంధుల ఆశాజ్యోతి లూయి బ్రెయిలీ జయంతి వేడుకలను ఈ నెల 4న నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి మిల్కా ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే కార్యక్రమానికి అంధ విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధికసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ



జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్‌కు పూలమొక్క అందజేస్తున్న ఎస్పీ

ఎదులాపురం: జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ వీఆర్‌ఆర్ వరప్రసాద్‌ను ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం స్థానిక కోర్టు ప్రాంగణంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్క అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇరువురు పరస్పరం లోక్ అదాలత్, కోర్టు కేసుల విషయాలపై చర్చించుకున్నారు.

పబ్లిక్ హెల్త్ ఉద్యోగుల అడహక్ కార్యవర్గం

కైలాస్‌నగర్: పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ అడహక్ జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.సత్యనారాయణరావు, ప్రధాన కార్యదర్శిగా సంతోష్ కుమార్, కోశాధికారిగా ఆడె సురేశ్, కార్యవర్గ సభ్యులుగా రాథోడ్ బాబులాల్, సచిన్, సుభాష్, సుశీల, సమి, శ్రీధర్, గంగాధర్ ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు రవీందర్ తెలిపారు.

రేపు అత్యాపాత్యా జిల్లా జట్ల ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా అత్యాపాత్య సంఘం ఆధ్వర్యంలో ఈనెల 4న జిల్లా సబ్ జూనియర్ బాలుర జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, గణేశ్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2007 జనవరి 1 తర్వాత జన్మించిన వారు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఎంపిక పోటీలు గురువారం మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మి వాడలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9866081088 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి



మారుతికి జ్ఞాపిక అందజేస్తున్న ఎస్పీ

ఎదులాపురం: ఉద్యోగ విరమణ తర్వాత ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల ని ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు జి.మారుతిని మంగళవారం కుటుంబ సమేతంగా ఎస్పీ కార్యాలయానికి పిలిపించి సన్మానించారు. ఇందులో సీసీ శ్రీనివాస్, హోంగార్డు ఆర్‌ఐ స్వామి, హోంగార్డ్ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.



సందిగ్ధం!

- పల్లె పోరుపై ఆశావహుల్లో ఉత్కంఠ
- పంచాయతీ రిజర్వేషన్లపై స్పష్టతనివ్వని ప్రభుత్వం
- ఈ నెల 31తో ముగియనున్న పాలకవర్గాల గడువు
- ప్రత్యేకాధికారుల పాలనకు అవకాశం

జిల్లాలోని గ్రామ పంచాయతీలు	: 468
వార్డు సభ్యుల స్థానాలు	: 3,830
మండల పరిషత్‌లు	: 17
జిల్లా పరిషత్	: 01
మండల పరిషత్ ప్రదేశిక స్థానాలు	: 476
మున్సిపల్	: 01

ఎలాంటి ఆదేశాలు రాలేదు

స్థానిక సంస్థలకు సంబంధించిన రిజర్వేషన్ల మార్పుపై ఇప్పటి దాకా ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు రిజర్వేషన్లను కొనసాగిస్తూ చట్టం చేసింది. కొత్త ప్రభుత్వం వాటిని కొనసాగిస్తుందా లేక మారుస్తుందా అనే దానిపై ఆదేశాలు వస్తే తప్ప తెలియదు. పంచాయతీ ఎన్నికల కసరత్తు సైతం నిలిపివేశాం. తదుపరి ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

– గణపతి, జెడ్పీ సీఈవో, శ్రీనివాస్, డీపీఓ

కైలాస్‌నగర్: గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు సమీపిస్తోంది. జిల్లాలోని ఆశావహులు ఇప్పటి నుంచే పోటీకి ఉవ్విళ్లూరుతున్నారు. ఎన్నికల బరిలో నిలిచేందుకు సన్నద్ధమవుతున్నారు. అయితే ఇదివరకున్న రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలు జరుగుతాయా లేక కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కారు వాటిని ఏమైనా మారుస్తోందా అనే సందిగ్ధం నెలకొంది. అయితే ఎన్నికల నిర్వహణకు అవసరమైన కసరత్తు ప్రారంభించాలని కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల కేటాయింపుపై మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు. ఆశావహులు మాత్రం ఈ సారి రిజర్వేషన్లు తమకు అనుకూలంగానే ఉంటాయనే ఉద్దేశంతో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనులు ఇప్పటికే మొదలెట్టారు.

31తో ముగియనున్న సర్పంచుల పదవీకాలం

గ్రామ పంచాయతీ పాలకవర్గాలకు ప్రభుత్వం 2019లో ఎన్నికలు నిర్వహించింది. అయితే పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించిన అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థలైన పంచాయతీలు, జిల్లా, మండల పరిషత్‌లు, మున్సిపాలిటీలకు కేటాయించిన రిజర్వేషన్లు పదేళ్ల పాటు కొనసాగించేలా తీర్మానిస్తూ చట్టాన్ని రూపొందించింది. ఈ మేరకు 30 మార్చి 2018న ప్రభుత్వం దీనిపై ఉత్తర్వులు జారీ చేసింది. సవరించిన పీఆర్ యాక్ట్ రిజర్వేషన్ల ప్రకారం గ్రామ పంచాయతీ ఎన్నికలను 2019 జనవరి 7, 14, 25 తేదీల్లో మూడు విడతలుగా నిర్వహించింది. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు ఫిబ్రవరి 2న ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 31తో వారి పదవీ కాలం ముగియనుంది. దీంతో ఎన్నికల నిర్వహణ అవశ్యకంగా ఏర్పడింది. ఆ దిశగానే ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొంటూ గత నెల 5న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఆదేశాలకనుగుణంగా అధికారులు పోలింగ్ సిబ్బంది వివరాలు సేకరించి సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేశారు.

ఎన్నికల నిర్వహణ సాధ్యమేనా..?

మరో 28 రోజుల్లో ప్రస్తుత పంచాయతీ పాలకవర్గాల గడువు ముగియనుండటంతో ఆ లోపు ఎన్నికల నిర్వహణ సాధ్యమేనా అనే ప్రశ్న తలెత్తుతుంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం ప్రకటించకపోవడంతో క్షేత్రస్థాయిలోనూ ఎన్నికల కసరత్తు ముందుకు సాగడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికిప్పుడు ఆదేశాలు జారీ చేసినా ఎన్నికల నిర్వహణ నిర్ణీత గడువులోగా సాధ్యమయ్యే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాతనే జరిగే అవకాశముందని వారు అభిప్రాయ పడుతున్నారు. ఇదే జరిగితే జీపీలలో ప్రత్యేకాధికారుల పాలన వచ్చే అవకాశం కన్పిస్తోంది. ఇది ఎంపీ ఎన్నికల వరకు కొనసాగే అవకాశముంటుందని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే మండల పరిషత్, జిల్లా పరిషత్ సభ్యుల పదవీకాల గడువు వచ్చే ఏడాదితో ముగియనుంది. వీటికి సైతం ఎన్నికలు నిర్వహించాల్సి ఉండటంతో పంచాయతీ ఎన్నికలతో కలిపే వాటిని నిర్వహిస్తారనే చర్చ కూడా మొదలైంది. అందుకోసం కొత్త ప్రభుత్వం సర్పంచ్‌లతో పాటు ఎంపీటీసీ, జెడ్పీటీసీలతో పాటు జెడ్పీ చైర్మన్ పదవుల రిజర్వేషన్లు సైతం మారుస్తుందనే ఊహాగానాల నేపథ్యంలో ఆశావహులు ఇప్పటి నుంచే తమ ప్రయత్నాలు ప్రారంభించారు. గ్రామస్తులను అప్యాయంగా పలుకరిస్తూ వారికి అవసరమైన కార్యక్రమాల్లో పాల్గొంటూ మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

బల్దియా తీరుతోనే ట్రాఫిక్ సమస్య

- పాలకవర్గ అనాలోచిత చర్యలతోనే ఇబ్బందులు
- గాంధీచౌక్ మార్గంలోని డివైడర్లు కూల్చేయండి
- ఎమ్మెల్యే పాయల్ శంకర్
- అధికారులతో కలిసి పట్టణంలో కాలినడకన పర్యటన



గాంధీ చౌక్‌లో ఇరుకుగా ఉన్న రోడ్డును కొలిపిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యకు మున్సిపల్ పాలకవర్గం అనాలోచిత చర్యలే కారణమని స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారిన అంబేద్కర్‌చౌక్ నుంచి దేవిచాంద్ చౌక్ వరకు గల రోడ్డులోని డివైడర్లను కూల్చివేయాలని ఆదేశించారు. మున్సిపల్, పోలీస్ అధికారులతో కలిసి పట్టణంలోని ట్రాఫిక్ సమస్యపై మంగళవారం సమీక్షించారు. వినాయక్‌చౌక్ నుంచి అశోక్ రోడ్, దేవిచంద్ చౌక్, గాంధీ చౌక్, మార్కెట్‌నుంచి అంబేద్కర్ చౌక్ వరకు కాలినడకన అధికారులతో కలిసి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. గాంధీ చౌక్‌లో రోడ్డు ఇరుకుగా మారడంపై అసహనం వ్యక్తం చేసిన ఆయన రహదారి కొలతలు చేశారు. డివైడర్ల ఎత్తు ఎక్కువగా ఉండటం, రోడ్ల పక్కనే తోపుడు బండ్లు, షాపుల ఎదుట వాహనాల పార్కింగ్ తోనే ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. దీనికి బాధ్యులెవరని మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. అవసరం ఉన్న చోట కాకుండా ట్రాఫిక్ సమస్య సృష్టించేలా డివైడర్లు ఏర్పాటు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాంసి బస్టాండ్ వైపు నుంచి అంబేద్కర్ చౌక్ వెళ్లాలంటే రాంగ్‌రూట్‌లో తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. అలా వెళ్లిన వారికి పోలీసులు చలాన్లు వేస్తున్నారన్నారు. సమస్యకు వెంటనే పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్, రెవెన్యూ అధికారులతో సమావేశమై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అలాగే కూరగాయల మార్కెట్, అంబేద్కర్ చౌక్, గాంధీ చౌక్, దేవిచంద్ చౌక్, శివాజీ చౌక్ తదితర ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించుకొని వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారాల ఉపాధికి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని సూచించారు. ప్రతిపక్షాలు సమస్యను అర్థం చేసుకొని పరిష్కారానికి సహకరించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శైలజ, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐ, మున్సిపల్, రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

నాణ్యమైన వైద్యసేవలందించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

కైలాస్‌నగర్: రిమ్స్ ఆసుపత్రికి వచ్చే పేద రోగులను ఇతర ప్రాంతాలకు రిఫర్ చేయకుండా స్థానికంగానే వారికి నాణ్యమైన వైద్యమందించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచించారు. రిమ్స్ మెడికల్ కళాశాలలోని సమావేశ మందిరంలో రిమ్స్ ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ, మెడికల్ కళాశాలల పనితీరుపై అధికారులు, వైద్యులతో తొలిసారి సమీక్ష నిర్వహించారు. రిమ్స్‌లో వసతులు, వైద్యులు, సిబ్బంది ఖాళీలు, మెడిసిన్ సరఫరా, కొనుగోలు, రోగులకు అందుతున్న వైద్యసేవలపై సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆసుపత్రిలోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేసేలా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళతానని పేర్కొన్నారు. సౌకర్యాల కల్పనకు అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. ఇబ్బందులుంటే ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ముందుగా రిమ్స్‌కు చేరుకున్న ఎమ్మెల్యేకు వైద్యులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. ఇందులో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- చాంద(టి)లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పరిశీలన



దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్‌రూరల్: అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఆరు గ్యారంటీలతో పాటు ఇతర సమస్యలపై ప్రజలు అందజేసే ప్రతీ దరఖాస్తు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని చాంద(టి)లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు దరఖాస్తు రశీదులను భద్ర పర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులను ఎంపిక చేసి ఆయా పథకాలను పారదర్శకంగా అమలు చేస్తామని తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ, పంచాయతీ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వామ్మో.. సమ్మెనట!



ఆదిలాబాద్‌లోని ఎన్టీఆర్ చౌక్‌లో గల పెట్రోల్‌బంక్‌లో వాహనదారుల రద్దీ

- పెట్రోల్ బంకుల్లో పెరిగిన రద్దీ
- బారులుతీరిన వాహనదారులు
- ఆందోళన వద్దంటున్న అధికారులు

కైలాస్‌నగర్: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన మోటర్ వాహన చట్టాన్ని నిరసిస్తూ పెట్రోల్, అయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మెకు దిగుతున్నారనే ప్రచార నేపథ్యంలో వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. పెట్రోల్, డీజిల్ కోసం బంక్‌లకు పరుగు తీశారు. జిల్లా కేంద్రంతో పాటు ఇచ్చోడ, బోథ్, ఉట్నూర్ తదితర ప్రాంతాల్లోని బంకుల్లో ఒక్కసారిగా రద్దీ పెరిగింది. గంటల తరబడి క్యూలో బారులు తీరారు. పలు ప్రాంతాల్లో రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

సరిపడా పెట్రో నిల్వలు


ఆదిలాబాద్ జిల్లాలో పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి ఇబ్బంది లేదని జిల్లా పౌరసరఫరలశాఖ అధికారి టి.కిరణ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు ఇతర మండలాల్లోని బంకుల్లో వినియోగదారులకు సరిపడేంత నిల్వలు ఉన్నాయన్నారు. ప్రజలు విషయాన్ని గమనించాలని, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నమ్మి ఆందోళన చెందవద్దని సూచించారు. బంకుల్లో నిలబడి సమయం వృథా చేసుకోవద్దన్నారు. జిల్లాకు రోజు వారీగా రావాల్సిన ఆయిల్ ట్యాంకర్లు యథావిధిగా వస్తున్నాయని, దీనిపై ఆయిల్ కంపెనీల సెల్స్‌ఆఫీసర్లు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని పేర్కొన్నారు.

ఈకేవైసీ గడువు పొడిగింపు

- ఈనెలాఖరు వరకు అవకాశం
- నమోదు చేసుకోవాలంటున్న అధికారులు

జిల్లాలో..

రేషన్ దుకాణాలు	: 356
మొత్తం రేషన్ కార్డులు	: 1,91,881
కార్డుల్లోని మొత్తం సభ్యులు	: 6,39,246
ఈకేవైసీ పూర్తి చేసుకున్నవారు	: 4,29,751



కైలాస్‌నగర్: బోగస్ రేషన్ కార్డులు ఏరివేయాలనే ఉద్దేశంతో చేపట్టిన రేషన్ ఈకేవైసీ నమోదు గడువును కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతేడాది సెప్టెంబర్‌లో ఈ ప్రక్రియ ప్రారంభం కాగా, డిసెంబర్ 31 వరకు గడువు విధించారు. అయితే జిల్లాలో ఈ ప్రక్రియ నెమ్మదిగా సాగింది. గడువు ముగిసినప్పటికీ పూర్తిస్థాయిలో కార్డుదారుల ఈకేవైసీ కాకపోవడంతో ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది.

జిల్లాలో 67 శాతమే పూర్తి..

దారిద్ర్య రేఖకు దిగువనున్న వారికి ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. ఇందులో చాలామంది అనర్హులు ఉండడంతో పాటు మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారు కూడా బియ్యం తీసుకుంటున్నట్లుగా కేంద్రం గుర్తించింది. దీనికి చెక్‌పెట్టేలా ఈకేవైసీ ప్రక్రియ చేపడుతోంది. గతేడాది సెప్టెంబర్‌లో ఈ ప్రక్రియ ప్రారంభించారు. డీలర్ల ద్వారా కార్డులోని సభ్యులందరి ఈకేవైసీ వివరాలు నమోదు చేశారు. డిసెంబర్ 31 గడువు ముగిసేనాటికి జిల్లా వ్యాప్తంగా కేవలం 67.23 శాతం మాత్రమే పూర్తయింది.

అప్‌డేషన్ లేకనే..

ఈకేవైసీ ప్రక్రియ గడువులోగా రేషన్ కార్డుదారులు పూర్తి చేయలేకపోయారు. దీనికి కారణం లేకపోలేదు. చాలా మందికి ఆధార్ అప్‌డేట్ లేకపోవడం, వృద్ధులు, చిన్నారుల ఐరిష్ వివరాలు రాకపోవడంతో నెమ్మదిగా సాగింది. డీలర్ల వద్దకు వెళ్లిన కార్డుదారుల్లోని కొంత మంది సభ్యుల ఆధార్ అప్‌డేట్ లేకపోవడంతో సమస్య తలెత్తింది. దీంతో వారికి ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. అలాంటి వారంతా ఆధార్ కేంద్రాల వద్దకు వెళ్లడంతో అక్కడ బారులు తీరుతున్నారు. గమనించిన ప్రభుత్వం ఈకేవైసీ గడువు పెంచాలని నిర్ణయం తీసుకుంది. ఈనెల 31వరకు రేషన్‌కార్డు దారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించింది. గడువులోగా వివరాలు సమర్పించకుంటే రేషన్ సరుకులకు దూరమయ్యే పరిస్థితి ఉంది.

వేగవంతం చేస్తున్నాం..

ఈకేవైసీ ప్రక్రియ వేగవంతం చేస్తున్నాం. ఇప్పటికే డీలర్లందరికీ ఆదేశాలు జారీ చేశాం. కేంద్రాలకు రాలేని వృద్ధుల వివరాలు సేకరించేందుకు వారి ఇంటి వద్దకే వెళ్లాలని సూచించాం. వారు క్షేత్రస్థాయికి వెళ్లి ఈ ప్రక్రియను చేపడుతున్నారు. ప్రభుత్వం గడువు పొడిగించింది. దీన్ని రేషన్‌కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలి.

– కిరణ్‌కుమార్, డీఎస్‌వో

కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ



కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు

కైలాస్‌నగర్: నూతన సంవత్సరం పురస్కరించుకొని కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. జిల్లా అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల బాధ్యులు మంగళవారం కలెక్టర్‌ను తన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. పలువురు అధికారులు నోట్‌బుక్స్, బ్లాంకెట్లు, పెన్నులు తదితరవి అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, శ్యామలా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో, జెడ్పీ సీఈఓ గణపతి, డీడబ్ల్యూవో మిల్కా, జిల్లా మత్స్య శాఖ అధికారి వై.సాంబశివరావు, డీటీఓ నిహారిక, ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సయ్య, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్, డీఎస్‌వో కిరణ్ కుమార్, డీఎస్సీ డీఓ సునితకుమారి, విజయ డెయిరీ డీడీ మధుసూదన్ రావు తమ శాఖల అధికారులు, ఉద్యోగులతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే టీఎన్‌జీఓస్ బాధ్యులు, తలమడుగు జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డితో పాటు పలువురు జర్నలిస్టులు కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టర్‌కు నోట్‌బుక్‌లు అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ సీఈవో గణపతి, అధికారులు

కలెక్టర్‌ను కలిసిన టీఎన్‌జీవోస్ నాయకులు

నూతన సంవత్సరం సందర్భంగా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్‌గౌడ్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, నర్సింహాచారి, టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నంద అశోక్, ఎ.నవీన్ కుమార్ తమ కార్యవర్గంతో కలిసి కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను మంగళవారం కలిశారు. పూలమొక్కలు, బ్లాంకెట్లు, నోట్‌బుక్‌లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

పీవోకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



పీవోకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న డేలివేజ్ ఉద్యోగుల సంఘం సభ్యులు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని చాహత్ బజ్‌పాయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పలు సమస్యలను పీవో దృష్టికి తీసుకెళ్లారు. పీవోను కలిసిన వారిలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రాజన్న, రాష్ట్ర సభ్యులు బాపురావు, ఉమ్మడి జిల్లా సంఘం సభ్యులు ఏ.శంకర్, మానిక్‌రావు, అక్బర్, రమేశ్ పాల్గొన్నారు.

ఓబీసీలో చేర్చాలి



గంగారాంకు వినతిపత్రం అందిస్తున్న ఓడ్ కులస్తులు

ఆదిలాబాద్‌రూరల్: గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 17కులాలను ఓబీసీలో చేర్చడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం ఓబీసీలోకి ఇప్పటి వరకు చేర్చలేదని వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఓబీసీలో చేర్చాలని తెలంగాణ ఓడ్ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు ఎన్‌సీబీసీ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాంను కోరినట్లు ఆ కులస్తులు తెలిపారు. మంగళవారం ఢిల్లీలో ఎన్‌సీబీసీ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం హయర్‌ను కలిసి వినతి పత్రాన్ని ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఆయా కులాలను ఓబీసీలోకి చేర్చకపోవడంతో కేంద్ర ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలతో పాటు ఉద్యోగావకాశాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. స్పందించిన ఆయన ఇది వరకే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఎన్‌సీబీసీ చైర్మన్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు చౌహన్ ప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాలుంకే శంకర్, నాయకులు మారుతి, భీంరావ్, గణేష్, దేవిదాస్, పృద్వీ, తదితరులు ఉన్నారు.

యువకుడి బలవన్మరణం

నర్సాపూర్(జి): అప్పుల బాధతో ఒకరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కుప్టీ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కుప్టీ గ్రామానికి చెందిన ఆలూర్ రవి (35) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ తనకున్న ఎకరం భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అప్పుల బాధతో ఇటీవల మద్యానికి బానిసై మంగళవారం మధ్యాహ్నం మద్యం మత్తులో ఇంటికి వచ్చాడు. మద్యానికి డబ్బుల కోసం భార్య లక్ష్మితో గొడవపడి గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తండ్రి రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పాడు.

నాగోబా జాతరపై రేపు సమీక్ష

ఇంద్రవెల్లి: ఫిబ్రవరి 9 నుంచి ప్రారంభం కానున్న నాగోబా జాతర ఏర్పాట్లపై ఈ నెల 4న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీవో చాహత్‌బాజ్‌పాయ్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష ఉంటుందని ఈవో రాజమౌళి ప్రకటనలో తెలిపారు. నాగోబా దర్బార్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సమీక్షకు ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

సర్దుబాటు చేశారు.. జీతాలు మరిచారు

నార్నూర్: రెవెన్యూ వ్యవస్థకు గుర్తింపుగా మిగిలిన వీఆర్‌ఏ వ్యవస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆగస్టు 10న రద్దు చేసింది. వారి విద్యార్హతల ఆధారంగా ఉత్తర్వులు 81, 85 ద్వారా ఇతర ప్రభుత్వ శాఖల్లో అటెండర్, రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ హోదాల్లో నియమించింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ నూతన ఉద్యోగాల్లో చేరింది మొదలు ఇప్పటి వరకూ వారికి వేతనాలు అందించకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యావసరాలు తీర్చుకోవడానికి సైతం అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని వారు వాపోతున్నారు.

- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు
- ఆరు నెలలుగా ఎదురుచూపు..



మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం

జిల్లాలో ఇలా..

జిల్లాలో 327 మంది వీఆర్‌ఏలను గత ప్రభుత్వం వివిధ శాఖలో సర్దుబాటు చేశారు. ఆరు నెలలుగా వేతనాలు అందకపోవడంతో వీరిలో చాలా మంది సెలవు దినాల్లో కూలీ పనికి వెళ్తున్నారు. ఇందులో నుంచి జూనియర్ అసిసెంట్లుగా 76 మంది, రికార్డు అసిస్టెంట్ 68 మంది, అటెండర్లుగా 99 మంది, చైన్‌మెన్‌లుగా19 మంది, హెల్పర్‌లు 28 మంది, వార్డు ఆఫీసర్లు ఏడుగురు, లస్కర్లు 11మంది, పబ్లిక్ హెల్త్ వర్కర్లు 11 మంది, రెనో ఆపరేటర్లు 2, వాచ్‌మెన్‌లు 5మంది మొత్తం 327మంది వీఆర్‌ఏలకు సర్దుబాటు చేశారు.

పట్టించుకునే నాథుడే లేడు...

గ్రామ రెవెన్యూ సహాయకులుగా పనిచేస్తున్న వారిని వివిధ శాఖల్లో విలీనం చేసిన ప్రభుత్వం ఆ తర్వాత వారికివ్వాల్సిన ఉద్యోగ గుర్తింపు సంఖ్య (ఐడీ) పీఆర్‌ఏఎస్ (పర్మినెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నెంబర్) కేటాయించకపోవడంతో జీతాలు అందడం లేదు. సమస్య పరిష్కారానికి కలెక్టర్లకు ఎన్నిసార్లు విన్నవించుకున్న ఫలితం లేదని వారంతా వాపోతున్నారు. గతంలో మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా జీతాలు చెల్లించే ప్రయత్నం జరగలేదని చెబుతున్నారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అటు మాతృశాఖ రెవెన్యూ, ఇటు కొత్త శాఖ నుంచి జీతాలు అందక కుటుంబాలు గడవని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ వేతనాల సమస్యను తీరుస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇదే విషయంపై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ క్రమబద్ధీకరణ కోసం సుమారుగా 80రోజుల పాటు సాగిన నిరవధిక సమ్మెకాలానికి సంబంధించిన వేతనాలు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వృద్ధాప్యంలో ఉన్న వారి వారసులకు ఉద్యోగాలే కల్పిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చినా అమలు చేయలేదని ఈ సమస్యకు కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆశిస్తున్నారు.

జీతాలు లేక కష్టంగా ఉంది



గతంలో వీఆర్‌ఏగా పని చేసినప్పుడు నెలనెలా జీతం వచ్చేది. ఉద్యోగ భద్రత అయితే కల్పించింద్రు కాని ఇప్పటి వరకు జీతాలు ఇవ్వలేదు. ఐదు, ఆరు నెలలుగా జీతాలు రాక కష్టంగా ఉంది. కుటుంబ పోషణ భారంగా మారుతోంది. జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– జిల్లెపల్లి రమేశ్, రికార్డు అసిస్టెంట్ తహసీల్దార్ కార్యాలయం, నార్నూర్

అప్పులు చేసి విధులు నిర్వర్తించాల్సి వస్తోంది



జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరి దాదాపు ఆరు నెలలు కావస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ప్రభుత్వం వేతనాలు మంజూరు చేయలేదు. ఐడీ నంబర్‌లు కేటాయించకపోవడంతో జీతాలు రాలేదని అధికారులు చెబుతున్నారు. అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సిన పరిస్థితి. అద్దె డబ్బులు చెల్లించకుంటే ఇబ్బంది పెడుతున్నారు.

– అదే మహేశ్, జూనియర్ అసిస్టెంట్, గాదిగూడ

బాధ అర్థం చేసుకోండి



వీఆర్‌ఏ నుంచి రికార్డు అసిస్టెంట్‌గా ఉద్యోగ భద్రత పొందిన సంతోషం కూడా లేదు. ఆరు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. దీంతో ప్రైవెట్ అప్పులు పెరిగిపోతున్నాయి. ఇప్పుడు వచ్చే జీతం వడ్డీలకే సరిపోతుంది. సరైనాసమయంలో జీతాలు అందించి కుటుంబాలను బతికించాలని కోరుతున్నాం.

– భాగ్యలక్ష్మి, రికార్డు అసిస్టెంట్ నార్నూర్

రాష్ట్ర స్థాయిలో మెరిసిన గురుకుల బాలికలు



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికలు రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనపరిచి బంగారు పతకాలు సాధించారు. గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో గత మూడు రోజుల క్రితం ఖమ్మం జిల్లాలోని సుదిమళ్లలో 7వ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో ఇచ్చోడ గురుకుల పాఠశాల బాలికలు తమ సత్తాను చాటారు. పదో తరగతి విద్యార్థి వైష్ణవి 200, 800 మీటర్ల పరుగు పందెంలో మొదటి బహుమతి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. తొమ్మిదవ తరగతి విద్యార్థి అర్చన బాక్సింగ్, అండర్ –17 లో మొదటి బహుమతి బంగారు పతకం సాధించింది. పదో తరగతి విద్యార్థులు పల్లవి, ఐశ్వర్య పరుగు పందెంలో రెండవ బహుమతి కింద వెండి పతకాన్ని సాధించింది. అత్యంత ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలను సాధించిన విద్యార్థులకు మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ రత్నకుమారి, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మికాంత్‌రావు, జూనియర్ వైస్‌ప్రిన్సిపాల్ అశ్విని, లక్ష్మి, పీఈటీలు గంగామణి, లత, నందిని ఉపాధ్యాయులు విద్యార్థినిలను అభినందించారు.

సావిత్రిబాయి పూలే జయంతిని విజయవంతం చేయండి



చిత్రపటాల వద్ద పూజలు చేస్తున్న సుకుమార్ పేట్కులే

ఆదిలాబాద్‌రూరల్: అఖిల భారతీయ మాలీ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బృందం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా బుధవారం భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 193వ జయంతిలో పాల్గొననున్నారు. అందులో భాగంగానే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే వేడుకలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రియాశీల కార్యకర్తలు, బహుజనవాదులు మీకు అందుబాటులో ఉన్న స్థలంలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయగలరని కోరారు. తమతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు వాడగురే విజయ్, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు నాగోశే శంకర్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు అడ్వకేట్ ఉమేష్ రావు డోలే, ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షులు మేంగాజి గురునులే, తదితరులు పాల్గొనున్నారన్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి జైలు

నిర్మల్‌టౌన్: హత్యాయత్నం కేసులో ఒకరికి జైలు, జరిమానా విధిస్తూ.. నిర్మల్ న్యాయస్థానం మంగళవారం తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ వివరాల ప్రకారం... భైంసా పట్టణం ఖాజీ గల్లీకి షేక్ రఫీ, షేక్ బషీర్ ఇద్దరు అన్నదమ్ములు. వీరి మధ్యలో కొంతకాలంగా ఆస్తి పంపకాల్లో గొడవలు జరుగుతున్నాయి. 23 నవంబర్ 2021న రాత్రి సమయంలో షేక్ బషీర్ తండ్రి బాబుమియా, తమ్ముడు రఫీతో ఆస్తి సరిగ్గా పంచలేదని గొడవపడ్డాడు. మరుసటి రోజు రాత్రి మళ్లీ తండ్రి, మరో తమ్ముడు పయాజ్‌తో గొడవ పడుతుండగా.. షేక్ రఫీ అడ్డుపడ్డాడు. రఫీ తప్పించుకోగా మెడపై గాయమైంది. అంతలో చుట్టుపక్కల వారు రావడంతో బషీర్ అక్కడి నుంచి పారిపోయాడు. ఈ విషయంపై షేక్ రఫీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై శివరామకష్ణ కేసు నమోదు చేసి నేరస్తుడిని అరెస్టు చేసి పరిశోధన నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారావు 11మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశాడు. షేక్ బషీర్‌కు ఐదేళ్ల కఠిన కారాగారా జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ.. అసిస్టెంట్ సెషన్స్ జడి తీర్పు నిచ్చారు.

డ్రైవర్ల ఆందోళన



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న డ్రైవర్లు

బేల: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జాతీయ రహదారిపై మంగళవారం అన్ని వాహనాల మండల డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఇందులో భాగంగా వారంరోజుల క్రితం పార్లమెంటు శీతకాల సమావేశాల్లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రోడ్డు ప్రమాదాల నివారణకు కొత్త చట్టాలను ప్రవేశపెట్టడంపై నిరసనగా రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్ల సంఘం మండల అధ్యక్షుడు షేక్ జబీ మాట్లాడుతూ రోడ్డుపై ఏదైనా ప్రమాదం జరిగితే డ్రైవర్లను బాధ్యులను చేసి వారి నుంచే నష్టపరిహారం వసూలు చేసేలా నూతన చట్టం తీసుకురావడం దురదృష్టకరమని తెలిపారు. ఈ నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు విస్తృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డ్రైవర్ల సంఘం నాయకులు సమీర్, సంతోష్, షహెజాద్ పాల్గొన్నారు.

కేంద్రం నిబంధనలు ఉపసంహరించుకోవాలి

ఎదులాపురం: భారత న్యాయ సంహిత చట్టంలో కేంద్ర ప్రభుత్వం పొందుపరిచిన హిట్ అండ్ రన్ నిబంధనలను ఉపసంహరించుకోవాలని లారీ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అక్బర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం భారత న్యాయ సంహిత చట్టంలో భాగంగా హిట్ అండ్ రన్ నిబంధనలను కఠినతరం చేసిందన్నారు. ఈ నిబంధనలను వెంటనే విరమించుకోవాలన్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 5వ తేదీన స్టీరింగ్ చోడో ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టడం జరుగుతుందని వివరించారు. ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇంటికల నెరవేరుతున్న వేళ



నిర్మాణం పూర్తయిన ఇల్లు

ఉట్నూర్‌రూరల్: పరిరక్షణ, అభివృద్ధి ప్రణాళిక ప్రకారం సీసీడీపీ విభాగం ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజన పీవీటీజీ కులాలకు సంబంధించి కొలాం, తోటి తెగల కుటుంబాలకు మంజూరైన వెయ్యి ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని ఏపీఓ పీవీటీజీ ఆత్రం భాస్కర్ మంగళవారం పేర్కొన్నారు. ఇండ్ల నిర్మాణంలో భాగంగా ఇది వరకే పలు ఇంటి నిర్మాణాలు పూర్తి అయ్యాయని మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. నిరుపేద పీవీటీజీ ఆదివాసీల కోసం ఈ ఇంటి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే బొజ్జు




కమిషనర్ కర్ణన్‌ను కలిసిన ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మంగళవారం హైదరాబాద్‌లో కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏజెన్సీలో మెరుగైన వైద్య సేవలపై చర్చించారు. అదే విధంగా పీహెచ్‌సీలో పనిచేస్తున్న తాత్కాలిక స్టాఫ్ నర్స్ ఉద్యోగాల్లో వారికి వేటేజీ మార్కులు ఇచ్చి ఆదుకోవాలని కోరినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఏజెన్సీలో వైద్య సదుపాయాలు, సిబ్బందిపై చర్చించడం జరిగిందన్నా రు. కాగా కమిషనర్ ఆర్వీ కర్ణన్ గతంలో ఉ ట్నూర్ ఐటీడీఏ పీవోగా విధులు నిర్వర్తించారు.

సాహితీకళల ప్రవీణుడు..

- యువకవి, కళాకారుడు పోలీస్ భీమేష్
- తాజాగా 'స్వేచ్ఛకు సంకెళ్లు' కవితాసంపుటి
- గవర్నర్ చేతుల మీదుగా కవిత సంకలనం ఆవిష్కరణ



స్వేచ్ఛకు సంకెళ్లు పుస్తక ముఖచిత్రం



కవితాసంపుటిని ఆవిష్కరిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

నిర్మల్‌ఖిల్లా: మాటల్లో చెప్పే దానికంటే జన బాహుళ్యంలోని సాహిత్యంతో చెప్తే దాని అర్థం నిగూఢంగా దాగి ఉంటుంది. పాఠకులను కూడా ఇట్టే ఆకట్టుకుంటుంది. జిల్లాకు చెందిన యువకవి, కళాకారుడు పోలీస్ భీమేష్ ఇదేరీతిలో ముందుకు సాగుతున్నాడు. నిర్మల్‌రూరల్ మండలం అనంతపేట గ్రామానికి చెందిన భీమేష్ అభిరుచిపరంగా రచనలు చేస్తుంటాడు. మూడుపదుల వయసులోనే ముచ్చట కొలిపే ప్రతిమలను తయారు చేయడం, సాహితీ రంగంలోనూ రాణిస్తున్నాడు. తాజాగా అతను రచించిన 'స్వేచ్ఛకు సంకెళ్లు' కవిత సంపుటి జనవరి 1న సోమవారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆవిష్కరించారు.

సాహితీవేత్తల ప్రోత్సాహం

సమాజం కోసం తాను పడే తపనను తన రచనల్లో పొందుపరుచుతూ జనాన్ని చైతన్యవంతం చేస్తున్నాడు. ఈ క్రమంలోనే కవితా సంపుటిని ప్రచురణకు ముందడుగు వేయగా జిల్లాలోని పలువురు సాహితీవేత్తలు, ప్రముఖులు ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. 'స్వేచ్ఛకు సంకెళ్లు' కవితా సంపుటి ప్రచురణ కోసం హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహకారం అందించింది.

శిల్పకారుడిగా రాణింపు...

పోలీస్ భీమేష్ సాహితీ పరంగానే కాకుండా శిల్పాలు, విగ్రహాలను అందంగా తీర్చిదిద్దడంలోనూ నైపుణ్యం కలిగి ఉన్నాడు. దుర్గాదేవి, వినాయక విగ్రహాలు, మహాలక్ష్మి అమ్మవారి విగ్రహాలను జీవకళ ఉట్టిపడే పడేట్లుగా రూపుదిద్దుతాడు. చెరువు మట్టితో పర్యావరణ హితమైన అద్భుతమైన రూపాలను చెక్కడం ఇతనిలోని ప్రత్యేకతకు నిదర్శనం. గతంలోనూ శివుడు, దుర్గాదేవి, వినాయకుడు వంటి దేవతమూర్తుల విగ్రహాలే కాకుండా దేశ జాతీయ నాయకులైన అంబేద్కర్, శివాజీ వంటి నాయకులను, దేవ సరిహద్దుల్లో వీరమరణం పొందిన పలువురి సైనికుల ప్రతిమలను తన చేతుల్లో అద్భుతంగా మలచడం విశేషం.

సాహిత్యంపై అభిరుచితోనే...

చిన్నప్పటి నుంచి సాహితీ రంగంపై ఉన్న మక్కువతోనే రచనలు చేయడం ప్రారంభించాను. ఈ రచనలన్నింటిని ఓ కవితా సంపుటిగా తీసుకురావాలని కోరికతోనే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అధికారులను సంప్రదించగా ఆర్థిక చేయూతను అందించారు. కవిత సంపుటిని గవర్నర్ తమిళిసై ఆవిష్కరించడం గొప్ప అనుభూతినిచ్చింది.

– పోలీస్ భీమేష్, కవి, నిర్మల్

చాంపియన్లుగా ఆదిలాబాద్, వరంగల్



బాలుర విభాగం విన్నర్‌గా నిలిచిన ఆదిలాబాద్ జట్టు



రన్నరప్‌గా నిలిచిన ఆదిలాబాద్ బాలికల జట్టు

- బాలుర విభాగంలో రన్నరప్‌గా మహబూబ్‌నగర్, బాలికల విభాగంలో మూడోస్థానం
- ముగిసిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ టోర్నీ

మహబూబ్‌నగర్‌క్రీడలు: జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ మైదానంలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 67వ రాష్ట్రస్థాయి అండర్–17 హ్యాండ్‌బాల్ టోర్నీ ముగిసింది. బాలుర విభాగంలో ఆతిథ్య ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు రన్నరప్‌గా, బాలికల విభాగాల్లో జిల్లా జట్టు మూడోస్థానంలో నిలిచింది. ఆదిలాబాద్–మహబూబ్‌నగర్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠంగా సాగింది. చివరకు ఆదిలాబాద్ జట్టు 20–17 గోల్స్ తేడాతో విజయం సాధించింది. బాలుర విభాగంలో మూడోస్థానంలో వరంగల్ జట్టు నిలిచింది. బాలికల విభాగంలో ఫైనల్ మ్యాచ్‌లో వరంగల్ 9–1 గోల్స్ తేడాతో ఆదిలాబాద్ జట్టును చిత్తు చేసి చాంపియన్‌గా నిలిచింది. ఇందులో పాలమూరు జట్టు మూడోస్థానంలో నిలిచింది. విజేతలకు జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ మెడల్స్ అందజేశారు. ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, టోర్నీ రాష్ట్ర పరిశీలకులు పుల్లయ్య, శ్రీనివాస్, గ్రామర్ స్కూల్ కరస్పాండెంట్ రాజేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ శాంత, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండి.జియావుద్దీన్, మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమర్ ఫర్హాత్, పెటాటీఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, కోచ్ విష్ణువర్ధన్, సహాయ కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

వరదకాలువలో పడి యువకుడి మృతి



అజేశ్(ఫైల్)

మోర్తాడ్: నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల శివారులోని వరదకాలువలో పడి అజేశ్(23) మృతి చెందినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలానికి చెందిన అజేశ్ మండల కేంద్రంలో రక్త, మూత్ర పరీక్షల ల్యాబ్ నిర్వహిస్తున్నాడు. గతంలో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేసిన అతను కొన్ని కారణాలతో బయటకు వచ్చి సొంతంగా ల్యాబ్ పెట్టాడు. ఆస్పత్రిలో పనిచేసినప్పుడు నిర్వాహకులతో ఆర్థిక లావాదేవీల విషయమై గొడవ జరిగినట్లు తెలిసింది. మనస్తాపానికి గురైన అజేశ్ మూడు రోజుల క్రితం కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు మోర్తాడ్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం వరదకాలువలో మృతదేహం లభించడంతో మిస్సింగ్ కేసు మిస్టరీ వీడింది. ఆస్పత్రి నిర్వాహకులు వేధింపులతోనే తమ కుమారుడు మరణించినట్లు మృతుడి తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబీకులు ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ధర్నా చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కంటైనర్ ఢీకొని వ్యక్తి మృతి



సైదు మృతదేహం

సోన్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని కడ్తాల్ గ్రామశివారులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని కడ్తాల్ గ్రామ శివారులో సోమవారం రాత్రి జాఫ్రపూర్ గ్రామానికి చెందిన తొండకూరి సైదు (57), తండ్రి కర్రన్న మోటారు సైకిల్‌పై బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా కడ్తాల్ వై జంక్షన్ మలుపు వద్ద కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సైదుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. భార్య లింగవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోషం రవీందర్ తెలిపారు.

12న 'చలో పార్లమెంట్'

ఎదులాపురం: దేశంలోని విద్యారంగ సమస్యల పరిష్కారానికి జనవరి 12వ తేదీన నిర్వహించనున్న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో విద్యారంగ పరిరక్షణకు చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 16 విద్యార్థి సంఘాలను కలుపుకొని కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సక్కు, జిల్లా కార్యదర్శి నగేష్, జుగాది రావు, సాగర్, రాము ఉన్నారు.

జాతివైరం మరిచి... మాతృత్వం చాటి..



తాంసి: మూగజీవాలు జాతి వైరాన్ని మరిచి ఇతర జీవాల ఆకలి సైతం తీరుస్తున్నాయి. ఈ దృశ్యం భీంపూర్ మండలంలోని భగవాన్‌పూర్ గ్రామంలో కనిపించింది. గ్రామానికి చెందిన యువరాజ్ పెంపుడు కుక్క ఇటీవల పిల్లలకు జన్మనిచ్చింది. వీటితో పాటు తన ఉన్న మేక పిల్లలు సైతం ఉన్నాయి. మంగళవారం ఇంటి ఆవరణలో శునకం పిల్లలు పాలు తాగుతుండగా మేక పిల్లలు సైతం వచ్చి శునకం వద్ద పాలు తాగుతూ ఆకలి తీర్చుకున్నాయి.